జిందగీ
# చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 11 మార్చి 2024 www.ntnews.com





# కాలం.. భారతీయం!

పరమాత్మ ఆదిమధ్యాంత రహితుడు. కాలం అనంతం. అనాది మాత్రమే అంతం కాగలుగుతుంది. కాబట్టి ఆదిమధ్యాంత రహితమైన కాలానికి, పరమాత్మకు అభేదం. పరమాత్మ సర్వవ్యాపి. సర్వత్రా వ్యాపించి ఉన్నదానికి పయనం అవసరం లేదు. కాబట్టి నిశ్చలుడు. నిర్గుణుడైన పరమాత్మ ప్రకృతి మాధ్యమంగా సగుణుడయ్యాడు. సగుణ రూప పరమాత్మ చలనశీలుడు.




**పద్నాలుగు** భువనభాండాలు ఉన్న విశ్వం నిశ్చలం. నడవలేని బ్రహ్మాండంలో కాలం సైతం నిశ్చలం. పద్నాలుగు భువనాల్లో ఒకటైన భూమిపైన జీవిస్తున్న మనకు సూర్యోదయం, సూర్యాస్తమయం వల్ల రోజులు ఏర్పడుతున్నాయి. చంద్రకళల వల్ల నెలలు తెలుస్తున్నాయి. నెలలు, రుతువుల వల్ల సంవత్సరాలు అవగతం అవుతున్నాయి. ఖగోళాల మాధ్యమంగా చలనశీల కాలగణనం చేయడమే జ్యోతిశ్శాస్త్రం పని. వేదానికి దృష్టిని ప్రసాదించే కన్నుగా జ్యోతిశ్శాస్త్రాన్ని అభివర్ణించారు మన రుషులు.



**అహోరాత్రం** అంటే పగలు, రాత్రి కలిసిన దినం. ఇందులో 'హోరా' అనే రెండు అక్షరాలను తీసుకొని రుషులు కాల ప్రమాణాన్ని ఏర్పరిచారు. ఒక రోజులో 24 హోరలు. సంస్కృత భాషలో హోరా శబ్దమే ఆంగ్లంలో 'అవర్' (hour) అయింది. పాశ్చాత్య విజ్ఞానాన్ని ఆధారం చేసుకున్న గడియారం ప్రకారం రోజుకు 24 గంటలు, గంటకు అరవై నిమిషాలు, నిమిషానికి అరవై సెకన్లు. ఇవి స్థిరం. భారతీయులకు అలా కాదు, మన కాలగణనంలో సూర్యోదయం నుంచి సూర్యోదయానికి ఒక దినం. సూర్యోదయ సమయం రోజుకో రీతిగా ఉంటుంది. సమయ కొలమానాన్ని గతిశీలకంగా నిర్దేశించడమే భారతీయ జ్యోతిశ్శాస్త్ర లక్షణం. రోజుకు 30 ముహూర్తాలు. అరవై ఘడియలు. ఘడియకు అరవై విఘడియలు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఉన్న కాలం ముప్పయ్ ఘడియలు లేదా పదిహేను ముహూర్తాలుగా విభజించారు. అలాగే సూర్యాస్తమయం నుంచి సూర్యోదయం వరకున్న కాలాన్ని కూడా స్పష్టంగా నిర్దేశించారు. ఘడియ అంటే 24 నిమిషాలు. విఘడియకు 24 సెకన్లు. ముహూర్తం అంటే 48 నిమిషాలు. ఇది స్థిరం కాదు. ఏ పగటికి ఆ పగలు, ఏ రాత్రికారాత్రి సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు, సూర్యాస్తమయం నుంచి సూర్యోదయం వరకున్న సమయాన్ని 30 భాగాలు చేసుకొని ఘడియను నిర్ధారించుకోవాలి. ప్రతి మూడు గంటలకు ఒక జాము. రోజులో ఎనిమిది జాములు. వీటికి ఎనిమిది పేర్లున్నాయి.

**కాలాన్ని** పరమాత్మ స్వరూపంగా భావించిన భారతీయులు! కాలాన్ని శాసించే మార్గాన్ని కూడా నిర్దేశించారు. సూర్యోదయం, మధ్యాహ్నం, సూర్యాస్తమయం అనే మూడు కాలాలలో గాయత్రీ మంత్ర మాధ్యమంగా సంధ్యావందనం ఆచరించడం అన్నది నిర్గుణోపాసనం. గాయత్రి మంత్రంలోని మూడు పాదాలు మూడు సంధ్యలకు, 24 అక్షరాలు 24 హోరలకు సంకేతాలు. 24 పూర్వ ముద్రలు గగన వీధిలో 24 హోరలలో సూర్యుడు ఉండే నిర్దుష్ట స్థానాలకు సంకేతాలు. అష్టకాలలో (ఎనిమిది జాముల్లో) సూర్యుడి నుంచి భూమి పొందుతున్న లాభాల వివరణే ఉత్తర ముద్రలు ఎనిమిదింటికీ ఉన్న అంతరార్థం.



**జరుగుతున్న** మార్పుల రీత్యా కాలాన్ని సృష్టి, స్థితి, లయలుగా చెప్పుకొంటున్నా. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా వరుసగా సృష్టి, స్థితి, లయకు అధిపతులు. కాల స్వరూపాన్ని సగుణ మార్గంలో అర్చించడమే త్రిమూర్తి పూజనం. సృష్టి, స్థితి, లయలను భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలుగా చెప్పుకొన్నప్పుడు ఈ పూజా విధానంలోని అంతరార్థం బోధపడుతుంది. మనం జన్మించిన మరుక్షణమే సృష్టి గతమైపోతుంది. గతానికి వర్తమానం లేదు. కాబట్టి సృష్టి కర్త అయిన బ్రహ్మదేవుడికి దేశమంతటికీ కలిపి 'పుష్కర్'లో మాత్రమే గుడి ఉన్నది. ప్రతిజీవికీ భవిష్యత్తు ఉన్నది. కానీ, అది ఎలా ఉంటుందో ఎవరూ చెప్పలేరు. భవిష్యత్తుకు రూపం లేదు. ఈ కారణంగా భవిష్యత్తుకు అధిపతి అయిన శివుడిని లింగాకారంలో అర్చిస్తున్నాం. వర్తమానమే జీవితం. వర్తమానం ఆహ్లాదకరంగా, వివరణాత్మకంగా ఉండాలి. అందుకే, విష్ణుమూర్తి అనేక అవతారాలలో అలంకార ప్రియుడయ్యాడు. కాలాన్ని నియంత్రించే పరమశివుడు మహాకాలుడు అయ్యాడు. ముగ్గురమ్మల మూలపుటమ్మ మహాకాళి అయింది. ఇదీ భారతీయులు కాలాన్ని అర్చించే విధానం.

... వరిగొండ కాంతారావు
94418 86824

> మిక్కిలి వాడి మొనగలిగిన సూదితో లేత తామరాకును పొడిస్తే రంధ్రం కావడానికి పట్టే సమయాన్ని 'త్రుటి' అన్నారు. 43,20,000 సంవత్సరాల కాల ప్రమాణాన్ని 'మహాయుగం' అని పేర్కొన్నారు రుషులు. వెయ్యి మహాయుగాలకు ఒక కల్పం. త్రుటి నుంచి కల్పం వరకు ఉన్న కాలాన్ని విభజించి వాటికి పేర్లు పెట్టడం భారతీయులకే సొంతమైన విజ్ఞానం.

## తుంగ నేర్పింది!

కథాసుధ

**ఓ** ఆశ్రమంలో నది ఒడ్డున సత్సంగం జరుగుతున్నది. భక్తులు అడుగుతున్న అనేక ప్రశ్నలకు గురువు సమాధానాలిస్తున్నాడు. 'నా జీవితమంతా సమస్యలే. వాటిని ఎదుర్కోలేక సతమతమవుతున్నాను' అని ఓ మధ్యతరగతి కుటుంబీకుడు అడిగాడు. గురువు చిన్నగా నవ్వి 'పక్కనే నదిలో ఉన్న తుంగ మొక్కలని కొద్దిసేపు చూసి రమ్మ'న్నాడు. అతను అలాగే చూసి వచ్చాడు. 'ఏం గమనించావు?' అని ప్రశ్నించాడు గురువు. 'నీటి ప్రవాహానికి తుంగ వంగుతున్నది. ప్రవాహం ఆగినప్పుడు మళ్లీ మామూలు స్థితికి వస్తున్నది. అందులో విశేషమేముంది?' అని బదులిచ్చాడు. 'అందులో చాలా పరమార్థం ఉంది నాయనా! తుంగ, నీటి ప్రవాహాన్ని ఎదుర్కోవాల్సి వస్తే... మనం కాల ప్రవాహాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. నదిలో నీటి ప్రవాహంలా.. కాలవాహినిలో కష్టాలు అందరికీ వస్తాయి. పరిస్థితులకు తలవంచి ఉన్నది ఉన్నట్టుగా స్వీకరించి తుంగలా నిలబడాలి. దాన్నే ఆలోచిస్తూ కూర్చుంటే సమస్యల సుడిగుండంలో కొట్టుకుపోతాం. అలాగే తుంగను తాకిన నీరు స్థిరంగా అక్కడే ఉండదు. అలాగే మనకు ఎదురైన సమస్యలు కూడా స్థిరంగా ఉండవు. 'ప్రవాహం పైపైకి వస్తోందే..' అని తుంగ బెదరదు. ఉన్నచోటనే నిలబడి తన మనుగడ సాగిస్తుంది. కాలప్రవాహం కూడా మనల్ని ఎన్నో ఆటుపోట్లకు గురి చేస్తుంది. వాటికి భయపడి పారిపోకూడదు. వాటినే ఆలోచిస్తూ కూర్చోకూడదు. కాలం ఎన్నో మార్పులను తీసుకువస్తుంది. వాటిని అంగీకరించాలి. ధైర్యంగా నిలబడాలి. ఆ కాలప్రవాహంలో కష్టాలు, కన్నీళ్లే కాదు, సుఖాలు సంతోషాలు కూడా ఉంటాయి. అన్నిటినీ సమంగా ఆస్వాదించాలి' అని వివరించాడు గురువు.

... ఆర్.సి.కృష్ణస్వామి రాజు, 9393662821

## వరాల వసంతానికి స్వాగతం

**మంగళవారం నుంచి రంజాన్ మాసం**

**ఏడాదిపాటు** దైవదూతలు ముస్తాబు చేసే స్వర్గం ఎంత మనోహరంగా, మరెంత ఆహ్లాదంగా ఉంటుందో ఊహించలేం. మరి అలాంటి ద్వారాలు తెరుచుకుంటే ఈ లోకమంతా స్వర్గధామం అవ్వదా. రంజాన్ నెలవంక నీలాకాశంలో తళుక్కున మెరవగానే స్వర్గ ద్వారాలు తెరుచుకుంటాయని ముస్లింల నమ్మకం. ముహమ్మద్ ప్రవక్త (స) నెలవంకను చూసి 'అల్లాహుమ్మ అహిల్లహు అలైనా బిల్ అమ్ని వల్ ఈమాని వస్సలామతి వల్ ఇస్లామి రబ్బీ వ రబ్బుకల్లాహు, హిలాలు రుష్ దిన్ వ ఖైరిన్' (ఓ అల్లాహ్ ఈ నెలవంకను మాకోసం సురక్షితమైనదిగా, విశ్వాసంతో కూడుకున్నదిగా, ప్రశాంతమైనదిగా చేయి. ఓ చంద్రుడా.. నా ప్రభువూ, నీ ప్రభువూ అల్లాహ్‌యే) అని పేర్కొన్నారు. నెలవంకను చూసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకొని మనసుల్లో ఉన్న స్పర్ధల్ని దూరం చేసుకుంటారు. కల్మషాలన్నిటినీ కడిగేసి మంచి మనసుతో రంజాన్ నెలను స్వాగతిస్తారు. 30 రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు పాటిస్తారు. ఈ నెలలో ఒక్క పుణ్యకార్యం చేస్తే 70 రెట్ల ఫలాన్ని ప్రభువు ఇస్తాడన్న నమ్మకంతో మంచి పనుల్లో పోటీ వాతావరణం ఉంటుంది. ఈ నెల రోజులు కఠోర ఉపవాసం పాటించడంతోపాటు అన్ని రకాల చెడులను త్యజించాలి. మన కన్ను, నోరు, నాలుక, కాళ్లు, చేతులు, మన హృదయం సర్వేంద్రియాలు ఉపవాసం ఆచరించాలి. అలాంటి ఉపవాసమే అల్లాహ్ స్వీకృతి పొందుతుందని ముహమ్మద్ ప్రవక్త (స) చెప్పిన బోధనను పరిగణనలోకి తీసుకోవాలి. ఈ నెలలో మసీదులన్నీ నమాజీలతో కళకళలాడుతాయి. జకాత్ దానాలు ఊపందుకుంటాయి. సంపన్నులు తమ సంపదలో రెండున్నర శాతం పేదలకు దానం చేస్తారు. మొత్తంగా వరాలనిచ్చే పవిత్ర మాసంలో.. ప్రభువు కృపను పొందడానికి శాయశక్తులా ప్రయత్నం చేద్దాం!

... ముహమ్మద్ ముజాహిద్, 9640622076

### ఏ అడ్డూ ఉండదు



**అల్లాహ్‌తో** ప్రత్యక్షంగా మాట్లాడిన ప్రవక్తలలో మూసా ఒకరు. ఆయన ఒకానొకసారి 'ఓ అల్లాహ్! నేను మీకు అత్యంత సన్నిహితంగా ఉన్నాను. మీతో నేరుగా మాట్లాడుతున్నాను. మీకు నాలాంటి సన్నిహితులు మరెవరైనా ఉన్నారా?' అని అడిగారు. అప్పుడు అల్లాహ్.. 'మూసా! ఈ సృష్టి చివరికాలంలో ఉమ్మెతె ముహమ్మదియాకు ఒక రంజాన్ నెల ప్రసాదిస్తాను. ఆ నెల రోజుల్లో నా దాసులు తడారిపోయినా పెదాలతో, ఆకలి కడుపులతో, పిడచకట్టుకుపోయిన నాలుకతో, పీక్కుపోయిన కళ్లతో ఇఫ్తార్ చేయడానికి కూర్చుంటారు. ఆ సమయంలో నేను వాళ్లకు అత్యంత సమీపంగా ఉంటాను. మూసా! నీకూ, నాకూ 70 పరదాల దూరం ఉంది. కానీ ఇఫ్తార్ వేళలో రోజేదార్లకూ, నాకూ ఒక్క పరదా కూడా అడ్డుగా ఉండదు. ఆ వేళలో ఎవరైనా నన్ను వేడుకుంటే నేను వారి దువాలను స్వీకరించడం నా బాధ్యత' అని తెలిపాడు.

# బాలకృష్ణుని లీలాభిరామం!

**శుకుడు పరీక్షిత్తుతో... రాజా! ఒకనాడు తల్లి యశోద పెల్లుబికిన ప్రేమతో చేపు వచ్చిన పాలను ఒడిలో పరున్న నల్లనయ్యకు తాగించింది. ఆ కల్లిబొల్లి పిల్లవాడు అల్లరిగా చిరునవ్వుతో నిద్ర వస్తున్నట్టు మెల్లన లీలగా ఆవులించాడు. కొండగుహ వంటి వాని నోటిలో- అవని, ఆకాశం, జ్యోతిర్మండలం, సూర్యచంద్రులు, పంచభూతాలు, పయోధులు, పర్వతాలు, సర్వనదులు, చరాచర బ్రహ్మాండమంతా కనిపించింది. యశోద అరమోడ్పు కళ్లతో నివ్వెరపోయింది. 'అమ్మా! నేను పాలు తాగుతున్నానంటే నాలో ఉన్న, 'అంతస్థ ం యస్య విశ్వం సురనర ఖగ గో భోగి గంధర్వ దైత్యైః'- (విష్ణు సహస్ర నామ స్తోత్రం) నేనే అయిన విశ్వమంతా కూడా నీ స్తన్యాన్ని పానం చేస్తోంది' అని సూచించడమే ఈ లీలా పరమార్థం.**

**రా**జా! బలరామకృష్ణులు పెరిగి పెద్దవాళ్లు అవుతున్నారు. తన ఈడు బాలురతో బాల్యక్రీడలు మరగి గోకులంలోని ఆ బాలగోపాలన్నీ చాలా చక్కగా ఆనంద డోలికలలో ఓలలాడిస్తున్నారు. వచ్చీరాని ముద్దుమాటల ముచ్చట్లతో పరమ సుఖానికి ఉన్న సరిహద్దులను చెరిపేస్తున్నారు. 'నాన్నలూ! ఏదీ! నాట్యమాడండి' అని ఇందు వదనలు- గోపికలు అంటే చాలు, వెంటనే కందువ- చతురతతో చేతులు, కాళ్లు అందంగా కదుపుతారు. వారిని ఆలోకించే- చూచే కొద్దీ గోకులంలోని లోకులందరికీ ఒక నిరాకుల- స్వస్థమైన తన్మయత్వం కలుగుతోంది. ఈ బాలలీలా వర్ణనంలో పోతన, భగవత్ వాసుదేవ తత్త్వాన్ని భాసురంగా ద్యోతన పరచే- ప్రకాశింపజేసే నూతన స్ఫురణ కల అమూలకాలైన అనేక అమూల్య కందాలను ఎంతో అందంగా వెలయించాడు...

**క|| 'నగవుల నవిద్య పోఁడిమి**
**నగుబాటుగఁ జేయనేర్చు నగవరి యంతన్**
**నగు మొగము తోడ మెల్లన**
**నగుమొగముల సతులఁజూచి నగనేర్చె నృపా!'**

రాజా! బాలకృష్ణుడు చిరునవ్వు చిందిస్తే జన్మజన్మల చాల దట్టమైన అజ్ఞానం ఒక్కపెట్టున నవ్వుల పాలైపోతుంది. విజ్ఞానం పుట్టుకొస్తుంది. అట్టి లోకాంతరంగుడు- సర్వజీవ అంతర్యామి అయిన శ్రీకాంతుడు ఇంతటి వింత బాలకుడై తనను చూచి నవ్వే- ఆనందించే గోపకాంతలను గాంచి రవ్వంత నవ్వడం నేర్చాడు. మాధవుడు మందహాసం చేస్తే ఏదో మాయ చేస్తాడని అర్థం! 'ప్రసన్న వదనం ధ్యాయేత్'- స్వామి నగుమోమును, ముదా-మోదంతో సదాస్మరించాలి. ముకుందుని మందహాసం 'శోకార్త శోషణం'- శోకాశ్రువులను శుష్కింపజేసేది- ఎండగట్టేది!


**కం|| 'అవ్వల నెరుఁగక ముమ్వురి**
**కవ్వల వెలుగొందు పరము డర్భకుఁడై యా**
**యవ్వలకు సంతసంబుగ**
**నవ్వా! యవ్వా! యనంగ నల్లన నేర్చెన్'**

త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, రుద్రులు- అనగా పరమార్థంలో క్రమంగా రజః, సత్త్వ, తమో గుణాలకు అతీతంగా విరాజిల్లే శ్రీమన్నారాయణుడు జన్మలు లేనివాడు కాన తనకు 'అమ్మ' అని కూడా ఎవరూ లేనివాడు. అట్టి పరమపురుషుడు ఇప్పుడు రోహిణీ యశోదలకు గారాబు పట్టియై, వారికి ఆనందం కలిగిస్తూ, ఆ ముద్దుగుమ్మలను 'అమ్మా! అమ్మా!' అని పిలవడం నేర్చుకున్నాడు. పరమాత్మకు గర్భవాసం లేదని కృష్ణావతార సందర్భంలో చెప్పుకొన్నాం.

**కం|| 'అడుగులు వేగలిగియు రెం**
**డడుగులనే మన్ను మిన్ను నలమిన బాలుం**
**డడుగిడఁ దొడఁగెను శాత్రవు**
**లడుగులు సడుగులును వదలి యడు గవనిఁబడన్'**

శ్రీమహావిష్ణువు 'సహస్రాక్ష స్సహస్రపాత్'- సహస్రపాదుడు. అనగా వేయి అడుగులు కలిగినవాడు. అయినా వామనుడు (పొట్టివాని)గా వచ్చి అవామనుడై రెండే అడుగులలో అవని (భూమి)నీ, ఆకాశాన్నీ ఆవరించినవాడు. అట్టి జగజెట్టి ఇప్పుడు నందుని పట్టియై- పుత్రుడై వచ్చి తప్పటడుగులు వేయడం నేర్చాడు. ఆ చిట్టివాడు గట్టిగా అడుగులు వేయడం చూచి దుష్టులు వంకర మాటలు కట్టిపెట్టి కడు భీతులై అడుగున పడి (అడుగంటి) పోయారు. ఈ సందర్భంలో శ్రీకృష్ణ కర్ణామృతంలోని లీలాశుకుని ముగ్ధమనోహరమై రసస్నిగ్ధమైన ఆలాపాన్ని- సూక్తిని తప్పక ఆలకించాలి... 'శృణు సఖి కౌతుకమేకం నందనికేతాంగణే మయాదృష్టం, గోధూళి ధూసరాఙ్గో నృత్యతి వేదాంత సిద్ధాంతః'.. ఓ చెలీ! నందప్రభువు గేహ ప్రాంగణంలో- ఇంటి ముంగిట నేను భలేవింతను కనుగొన్నా. ఏమిటో తెలుసా? గోధూళిచే ధూసరితమైన దేహంతో నిగమాంతాలు- ఉపనిషత్తులు ప్రతిపాదించిన పరబ్రహ్మ తత్త్వం నాట్యమాడుతోంది.

బలరామకృష్ణుల బాల్య క్రీడలు- లీలలు గోపాలసతులకు చాలా మధురంగా తోచేవి. ఆ తీపులు- మాధుర్యాలు మరగి అప్పాటల గంధలు (గోపికలు) ఇంటిని, ఒంటిని- మనసుకంటిన అన్ని బంధాలను మరచి ఆ చంటివారి ఆటలనే మక్కువతో కంటూ ఉండిపోయేవారు. 'భజతే తాదృశీః క్రీడా యా శ్రుత్వా తత్పరో భవేత్' (రాజా! తన ఎట్టి క్రీడలను విని- విమర్శించి భక్తుడు అందు పారవశ్యాన్ని పొంది జ్ఞాని అగునో, భగవంతుడు అట్టి క్రీడ-లీలలతో కనువిందు చేస్తాడు) అని శుకముని వచనం. ప్రపంచ విస్మరణం, పరమాత్ముని అనుస్మరణం- ఇదే భగవల్లీలా శ్రవణానికి ఫలం! పూతనారి బాలశౌరి రోజురోజుకి నడవడం, మాట్లాడటంలో ఆరితేరాడు. తల్లులు రోహిణీ యశోదలు గోళ్లు, కొమ్ములు గల జంతువుల నుంచి, నీళ్లు నిప్పు ముళ్లు మొదలైన వాటి నుంచి పిల్లలకు ఎలాంటి ముప్పు కలగకుండా ఎప్పటికప్పుడు కాపాడుకొనేవారు.



మన పోతన మధురిమ 163 వ భాగం

ఒకనాడు ముద్దుల కొడుకు కన్నయ్య వద్దు వద్దంటున్నా వినకుండా తిన్నగా వెళ్లి ఒక ఎద్దు కొమ్ములు పట్టుకున్నాడు. బంగారుని అది ఎక్కడ పొడుస్తుందో అని యశోదకు కంగారు! 'భవిష్యత్తులో వృషభాసురుణ్ని అవలీలగా నిలవరించడానికి చేసే అభ్యాసమే ఇది' (అభ్యాసేన తు కౌన్తేయ వైరాగ్యేణచ గృహ్యతే-గీత) అని లీలా పరమార్థం! ఆ చిన్నివాని నీలి వన్నెలు చూచి వల్లవ (గోప) కన్నెలు తమ పున్నెముల పంటగా భావించి అన్య చింతలు మరచిపోయేవారు ఆ ధన్య జీవనలు.

**కం|| 'వల్లవ గృహ నవనీతము**
**లెల్లను భక్షించి వచ్చి యెరుఁగని భంగిం**
**దల్లిఁ గదిసి చిట్టాడుచు**
**నల్లన చను బువ్వఁబెట్టు మవ్వా! యనుచున్'**

కర్మ, జ్ఞాన, భక్తి, ధ్యాన, రాజ, హఠ యోగాదుల మాట ఎలా ఉన్నా గోకులంలో ప్రస్తుతం, పైకి హేయంగా తోచినా భావుక భక్తులకు, తత్త్వవిదులకు అత్యంత ధ్యేయ (ధ్యానించ తగిన)మైన స్తేయయోగం- చౌర్యలీల మాత్రం దిగ్విజయంగా సాగుతోంది. వ్రేత (గోపిక)ల ఇళ్లల్లో నవనీతాలు- వెన్నలన్నీ దొంగతనంగా తిని ఇంటికి వచ్చి ఏమీ ఎరుగనట్లు బుడిబుడి నడకలతో సవ్వడి చేయక తల్లివద్దకు వచ్చి నెమ్మదిగా 'అవ్వా! (అమ్మా) ఆకలివేస్తోంది, బువ్వపెట్టవా?' అని అడుగుతాడు.

రాజా! ఆ బాలగోపాలుడు గోపబాలకులతో కలిసి చాలా ఆటలు ఆడేవాడు. పూత చరిత్రుడైన పోతన రససిద్ధుడై అమలిన భక్తితో ఈ సీసపద్యంలో కమలేశుని- శ్రీకృష్ణుని తత్త్వాన్ని- స్వరూప స్వభావాలను ప్రజాయాస (భాషారీతి)లో పూసగుచ్చినట్లు అనాయాసంగా వర్ణించాడు...

**సీ|| 'గోవల్లభుడ నేను, గోవుల మీరని**
**వడి రంకెవైచుచు వంగియాడు**
**రాజనే భటులు మీరలు, రండురండని**
**ప్రాభవంబునఁబెక్కు పనులు పనుచు**
**నేఁదస్కరుండ, మీరింటి వారని నిద్ర**
**పుచ్చి సొమ్ములు గొని పోయిడాఁగు**
**నే సూత్రధారి, మీరందరు బహురూపులని**
**చెలంగుచు నాటలాడఁబెట్టు**
**తే|| మూల లురుకును, డాఁగిలి మూతలాడు**
**నుయ్యెలల నూఁగు జేబంతు లొనరవైచు**
**జారచోరుల జాడలఁ జాలనిగుడు**
**శౌరి బాలురతో నాడు సమయమందు...**

'మీరందరూ ఆవులు, నేను గోవల్లభుడను- ఆబోతుని' అంటూ ఆబోతులా వంగి రంకెవేస్తాడు. 'నేను రాజును, మీరు భటులు' అంటూ వాల్లభ్యం- ఆధిపత్యం చూపుతూ వారిచేత ఎన్నో పనులు చెప్పి చేయిస్తూంటాడు. 'నేను దొంగను, మీరు ఇంటి యజమానులు' అంటూ వారి కంటిమీద కునుకు- నిద్ర నటింపజేస్తూ వారి ఉపకరణాలు- సొమ్ములను అపహరించి పారిపోయి దాక్కుంటాడు. 'మీరు వివిధ పాత్రధారులు, నేను సూత్రధారిని' అంటూ వారందరిచే అనేక వేషాలు వేసి ఆడించేవాడు. తాను మూలమూలల్లో దూరుతూ వారితో దాగుడు మూతలు ఆడించేవాడు. ఉయ్యెలలూగేవాడు. చేబంతులెగరేసేవాడు. జారుడుగా, చోరుడుగా నటిస్తూ, వారిముందు అవ్వారి- నిరంకుశంగా పలు పోకడలు పోయేవాడు'. (సశేషం)



తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006